ప్రజల చేతిలో
www.ayudamdaily.com
# ఆయుధం
The Common People's Voice
గురువారం | సెప్టెంబరు 10, 2026 | సంపుటి : 7 | సంచిక : 86 | పేజీలు : 2



## ప్రజాకవి కాళోజీ జీవితం
# ఆదర్శనీయం

- వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య
- ఘనంగా కాళోజీ జయంతి
- నివాళులర్పించిన ఎంపీ డాక్టర్ కడియం కావ్య, కలెక్టర్ చాహత్ బాజ్ పాయి, తదితరులు


**హనుమకొండ, ఆయుధం:** ప్రజాకవి కాళోజీ నారాయణరావు తన కలం ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చారని, చైతన్య స్ఫూర్తిని కలిగించిన కాళోజీ జీవితం ఆదర్శనీయమని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య అన్నారు. కాళోజీ జయంతిని పురస్కరించుకుని బుధవారం హనుమకొండ నక్కలగుట్ట లోని కాళోజీ విగ్రహానికి ఎంపీ డాక్టర్ కడియం కావ్య, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి, అదనపు కలెక్టర్ ఎన్. రవి, కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత అంపశయ్య నవీన్, తదితర ప్రముఖులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ... తెలంగాణ భాషా దినోత్సవాన్ని కాళోజీ జయంతి సందర్భంగా నిర్వహించుకోవడం ఎంతో సంతోషకరమని పేర్కొన్నారు. ప్రజల సమస్యలు, ఇబ్బందులను తన రచనల ద్వారా ఎప్పటికప్పుడు ప్రజల ముందుకు తీసుకువెళ్లి, వారిలో చైతన్యం నింపిన కాళోజీ నేటి తరానికి ఆదర్శప్రాయుడని అన్నారు. తెలంగాణ సాధన ఉద్యమంలో కాళోజీ సాహిత్య స్ఫూర్తి, ఆయన రచనలు ప్రజల్లో గొప్ప చైతన్యాన్ని నింపాయని అన్నారు. కాళోజీ వరంగల్‌కు చెందిన వారు కావడం గర్వకారణం అని తెలిపారు. ప్రజాకవి కాళోజీ రచనలు, సాహిత్యాన్ని ప్రతి ఒక్కరూ చదవాలని, ముఖ్యంగా యువత కాళోజీ ఆలోచనా విధానాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతి శుభాకాంక్షలను ప్రజలందరికీ ఎంపీ కడియం కావ్య తెలిపారు. ఈ సందర్భంగా పలువురు కాళోజీ నారాయణ రావు ఆశయాలను కొనసాగిద్దామని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి అదనపు కలెక్టర్ శేషాద్రి, కాళోజీ ఫౌండేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నాగిళ్ల రామశాస్త్రి, వీఆర్ విద్యార్థి, కోశాధికారి పందిళ్ల అశోక్ కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ ఆగపాటి రాజ్ కుమార్, సంయుక్త కార్యదర్శి పొట్లపల్లి శ్రీనివాస రావు, రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్ర పాలక మండలి సభ్యులు ఈ.వి. శ్రీనివాసరావు, హనుమకొండ తహసీల్దార్ రవీందర్ రెడ్డి, ఇతర అధికారులు, పలువురు కవులు, కళాకారులు, తదితరులు పాల్గొన్నారు.

### కాళోజీ కళాక్షేత్రంలో..

ప్రజాకవి కాళోజీ జయంతిని పురస్కరించుకొని హనుమకొండ బాలసముద్రంలోని కాళోజి కళాక్షేత్రంలో కాళోజీ నారాయణ రావు విగ్రహానికి హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి పూలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కుడా సిపీవో అజిత్ రెడ్డి, ఈఈ బీమ్ రావు, తదితరులు పాల్గొన్నారు.

## విచారణ జరిపిస్తాం : రేవంత్ రెడ్డి

- అసెంబ్లీలో బీఆర్ఎస్ నేతల తీరుపై ఆగ్రహం
- కులవివక్ష, అణచివేత చర్యలను ఈ ప్రభుత్వం ఉపేక్షించదు
- ఎర్రవల్లి ఫామ్ హౌజ్‌లోనే కుట్ర జరిగిందని ఆరోపణ



2 లో

## గవర్నర్‌కు ఆధారాలు చూపాం

- బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నేతలు
- మహిళా ఎమ్మెల్యేలపై పోలీసుల అనుచిత ప్రవర్తనపై ఫిర్యాదు చేసిన నేతలు
- శాంతిభద్రతలు, ఇతర అంశాలపై గవర్నర్‌కు ఫిర్యాదు



2 లో

# చలో హైదరాబాద్ వాయిదా వేశాం..

## 18 వరకు ప్రభుత్వం చర్చలకు పిలుపునిచ్చింది

- ఆ తర్వాతే తదుపరి కార్యాచరణ ఉంటుంది..
- ఉద్యోగుల జేఏసీ చైర్మన్ మారం జగదీశ్
- టీఎన్‌జీవోస్ భవన్‌లో ఎంప్లాయీస్ జేఏసీ మీడియా సమావేశం

**(హైదరాబాద్, ఆయుధం)**

పీఆర్‌సీ, ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సూచన మేరకు వాయిదా వేసినట్లు ఎంప్లాయీస్ జేఏసీ చైర్మన్ మారం జగదీశ్ పేర్కొన్నారు. బుధవారం సీఎస్ సంజయ్ జాజు తో భేటీ అనంతరం ఆయన TNGOS భవన్ లో మీడియా సమావేశంలో మాట్లాడారు. "సీఎస్ సూచన మేరకే చలో హైదరాబాద్ వాయిదా వేశాం.. ఇవాళ పీఆర్‌సీ కమిషన్ లెటర్ రాయటం జరిగింది.. అసెంబ్లీ తరవాత మాట్లాడుదాం అన్నారు.. 18 వరకు చర్చలకు పిలుపు ఇచ్చారు.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సీఎస్‌కు ఆదేశించారు..



మేము లిఖిత పూర్వకంగా ఇవ్వాలని కోరాం. ఈ నెల 18 తమ కార్యాచరణ ఉంటుంది. లిఖిత పూర్వకంగా ప్రభుత్వం మాకు ఇవ్వడం మా విజయం అనుకుంటున్నాం.." అని పేర్కొన్నారు. చలో హైదరాబాద్ కార్యక్రమానికి ప్రభుత్వం మాకు పర్మిషన్ ఇవ్వలేదని.. తాము కోర్టుకు వెళ్లి పెర్మిషన్ తెచ్చుకున్నామని స్పష్టం చేశారు. ఉద్యోగులకు ఇవ్వాల్సిన బాధ్యత ప్రభుత్వానికి ఉన్నదని అన్నారు. తాము న్యాయమైన డిమాండ్ లే చేస్తున్నామని.. ఛలో హైదరాబాద్ తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. ప్రభుత్వం నుంచి సానుకూలంగా.. రాకపోతే తదుపరి కార్యాచరణ (మిగతా 2 లో..)





## శ్రీ పోచమ్మ దేవాలయంలో కుడా చైర్ పర్సన్
# గుండు సుధారాణి పూజలు

**వరంగల్ పోచమ్మ మైదాన్ లోని శ్రీ పోచమ్మ దేవాలయంలో కాకతీయ అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ(కుడా) చైర్ పర్సన్, మాజీ రాజ్యసభ సభ్యురాలు, జిడబ్ల్యూ ఎంసి మాజీ మేయర్ గుండు సుధారాణి బుధవారం అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.**

*– వరంగల్, ఆయుధం*

## 'సభా గౌరవాన్ని మంటగలపొద్దు'

- స్పీకర్ పదవిని గౌరవించాలి.. అనుచిత వ్యాఖ్యలకు క్షమాపణ చెప్పాలి
- మహిళా పోలీసుల పట్ల దురుసు ప్రవర్తనపై జాతీయ మహిళా కమిషన్ కు ఫిర్యాదు చేశాం
- ఎంపీ డా. కడియం కావ్య

**హనుమకొండ, ఆయుధం:** శాసనసభలో స్పీకర్ స్థాయిలో ఉన్న వ్యక్తిపై అనుచిత, అసభ్య పదజాలం ఉపయోగించడం ప్రజాస్వామ్య విలువలను దిగజార్చడమేనని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య అన్నారు. ప్రజాకవి, పద్మవిభూషణ్ కాళోజీ నారాయణరావు 112వ జయంతిని పురస్కరించుకుని హనుమకొండలోని కాళోజీ విగ్రహానికి వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కాళోజీ సేవలను, సాహిత్య ప్రస్థానాన్ని స్మరించుకున్నారు.
అనంతరం వరంగల్ ఎంపి డాక్టర్ కడియం కావ్య మీడియాతో మాట్లాడుతూ



స్పీకర్ ఏ కులం, ఏ మతానికి చెందిన వ్యక్తి అన్నది కాకుండా.. ఆ కుర్చీని, రాజ్యాంగ బద్ధమైన పదవిని గౌరవించాల్సిన బాధ్యత ప్రతి ప్రజాప్రతినిధిపై ఉందన్నారు. అనుచిత పదజాలం ఉపయోగించిన వారు తమ తప్పును తెలుసుకుని కూడా క్షమాపణ చెప్పేందుకు ముందుకు రాకపోవడం విచారకరమన్నారు. ప్రజాప్రతినిధులు హుందాగా వ్యవహరించాల్సిన అసెంబ్లీలో ఇలాంటి పదజాలానికి తావివ్వడం ఎవరూ హర్షించరని పేర్కొన్నారు. సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న కేసీఆర్ ఇలాంటి భాషను గతంలో ఎప్పుడైనా ప్రోత్సహించారా? పార్లమెంట్లో గానీ, అసెంబ్లీలోగానీ ఇలాంటి పదజాలం వినడం జరిగిందా? అని ప్రశ్నించారు. తప్పు జరిగితే అంగీకరించి (మిగతా 2లో..)



# రైస్ మిల్లర్ల సమస్యలు పరిష్కరించాలి

- జాయింట్ కలెక్టర్‌కు రైస్ మిల్లర్స్ అసోసియేషన్ వినతి

**హనుమకొండ, ఆయుధం:** రైస్ మిల్లర్లు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ వరంగల్ జిల్లా, హనుమకొండ జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మిల్లర్లు కలెక్టర్ లకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ధాన్యం సేకరణ, మిల్లింగ్ ప్రక్రియకు సంబంధించి స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేయాలని కోరారు. మిల్లింగ్ సమయంలో డ్యామేజ్, నూకలు తదితర కారణాలతో ఏర్పడే షార్ట్‌ఫాల్ పై మిల్లర్లపై చర్యలు తీసుకోవద్దని విజ్ఞప్తి చేశారు. అలాగే రబీ 202526 సీజన్‌కు సంబంధించిన బాయిల్డ్ రైస్, రా రైస్ డెలివరీ సమస్యలను పరిష్కరించాలని, OTR, టెస్ట్ మిల్లింగ్‌కు సంబంధించిన బకాయిలను వెంటనే చెల్లించాలని కోరారు. గత సంవత్సరాల నుంచి పెండింగ్‌లో ఉన్న మిల్లింగ్, డ్రైయిజ్, కస్టోడియన్, రవాణా చార్జీలను కూడా తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రైస్ మిల్లర్లు ఎదుర్కొంటున్న సమస్యలపై అధికారులు సానుకూలంగా స్పందించి, త్వరితగతిన పరిష్కారం చూపాలని అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. రాష్ట్రవ్యాప్తంగా రైస్ మిల్లర్ల సమస్యల పరిష్కారం కోసం అసోసియేషన్ ఆందోళనలు కొనసాగిస్తున్న నేపథ్యంలో హనుమకొండలో జాయింట్ కలెక్టర్‌కు సమర్పించిన ఈ వినతిపత్రం ప్రాధాన్యత సంతరించుకుంది.

## ఘట్‌కేసర్-కాజీపేట
# 110 కి.మీ. నాలుగో రైల్వే లైన్ నిర్మాణం

- తెలుగు రాష్ట్రాల్లో రైల్వే లైన్లకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం
- కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడి

**జాతీయం, ఆయుధం:** దేశవ్యాప్తంగా పలు రైల్వే కారిడార్లలో నాలుగు లైన్ల నిర్మాణం చేపట్టడానికి కేంద్ర ప్రభుత్వం సిద్ధమైంది. ఇందుకోసం 8 మల్టీ ట్రాకింగ్ ప్రాజెక్టులకు కేంద్ర క్యాబినెట్ పచ్చజెండా ఊపింది. దక్షిణాదిలో 5, ఉత్తరాదిలో 3 ప్రాజెక్టులకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. దీంతో తెలంగాణ, ఏపీ, తమిళనాడు, కర్ణాటక పరిధిలో ఐదు మల్టీ ట్రాకింగ్ ప్రాజెక్టులు రాబోతున్నాయి. ఈ మేరకు క్యాబినెట్ నిర్ణయాలు కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్ మీడియాకు వెల్లడించారు.
ఈ నాలుగు రాష్ట్రాల్లోని 17 జిల్లాల పరిధిలో నాలుగు లైన్ల రైల్వే నెట్‌వర్క్ నిర్మాణం చేపట్టనున్నారు. ఈ ప్రాజెక్టుల అంచనా వ్యయం రూ.10,021కోట్లుగా కేంద్రం పేర్కొంది. 202930నాటికి వీటిని పూర్తి చేయాలని ప్రణాళిక వేసింది. ఈ మల్టీ ట్రాకింగ్ ప్రాజెక్టులతో దక్షిణాదిలో 2,121 గ్రామాలకు రైలు మార్గం అందుబాటులోకి రానున్నట్లు తెలిపింది.



**దక్షిణాదిలో ప్రాజెక్టులు ఇవే..**

- రూ.2,419 కోట్లతో ఘట్‌కేసర్-కాజీపేట మధ్య 110 కి. మీ. పొడవైన నాలుగో లైన్ నిర్మాణం
- అరక్కోణం-రేణిగుంట సెక్షన్‌లో 77 కిలోమీటర్ల పొడవుతో 3,4 లైన్ల నిర్మాణం
- వైట్‌ఫీల్డ్-బంగారుపేట మధ్య 47 కిలోమీటర్ల పొడవుతో 3, 4 లైన్ల నిర్మాణం
- 159 కి.మీ. మేర సేలంకరూర్-దుండిగల్ డబ్లింగ్
- 147కి.మీ. మేర హోసూర్-ఒమలూరు డబ్లింగ్‌కు కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది.

# ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

**వరంగల్, ఆయుధం:** అవోపా కాకతీయ వరంగల్ వారి ఆధ్వర్యంలో దేశాయ్ పేట లో ఉన్న షణ్ముఖ బ్యాంకెట్ హాల్ లో ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. అధ్యక్షులు మిత్తింటి శ్రీనివాసులు ఈ సమావేశానికి అధ్యక్షత వహించినారు. ముఖ్యఅతిథిగా ఆర్యవైశ్య మహాసభ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షులు శిరుప అనిల్ విచ్చేసి మంచి కార్యక్రమం నిర్వహిస్తున్న ఆవోపా కాకతీయ వరంగల్ వారిని అభినందించారు. సమాజంలో ఉపాధ్యాయులకు ఎంతో గౌరవం ఉందని భావి భారత పౌరులను తీర్చిదిద్దే అవకాశం ఉపాధ్యాయులకు మాత్రమే ఉందని ఉపాధ్యాయుల రుణాన్ని మనం తీర్చలేమని అన్నారు. సన్మాన గ్రహీతలకు అభినందనలు తెలియజేశారు. విశిష్ట అతిథిగా విచ్చేసిన వరంగల్ జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు దుబ్బ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతి వ్యక్తి ఉన్నత





స్థానంలో నిలవడానికి ఉపాధ్యాయులు చేస్తున్న కృషి చాలా మహోన్నతమైనది అని అన్నారు. ఈ కార్యక్రమంలో అవోపా రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ గుండా రవీందర్, ఆవోపా కాకతీయ వరంగల్ ప్రధాన కార్యదర్శి కల్లూరి వెంకటేశ్వర్లు, ఫైనాన్స్ సెక్రటరీ పాల సత్యనారాయణ, అసోసియేట్ అధ్యక్షులు తాళ్ళపల్లి వాసుదేవులు, ఆర్గనైజింగ్ సెక్రటరీ మంచాల విజయ్, ఉపాధ్యక్షులు గాదె వాసుదేవ్, సన్మాన గ్రహీతలు వారి బంధుమిత్రులు, ఆవోపా కాకతీయ వరంగల్ సభ్యులు పాల్గొన్నారు.

## శ్రీవారి భక్తులకు బీమా

- టీటీడీ పాలక మండలి కీలక నిర్ణయాలు



2 లో

# విచారణ జరిపిస్తాం : రేవంత్ రెడ్డి

- **అసెంబ్లీలో బీఆర్ఎస్ నేతల తీరుపై ఆగ్రహం**
- **కులవివక్ష, అణచివేత చర్యలను ఈ ప్రభుత్వం ఉపేక్షించదు**
- **ఎర్రవల్లి ఫామ్ హౌజ్‌లోనే కుట్ర జరిగిందని ఆరోపణ**

**హైదరాబాద్, ఆయుధం:** ఉగ్రవాదులకు, స్పీకర్‌ను తిట్టిన వారికి తేడా లేదన్న సీఎం రేవంత్ రెడ్డి కులవివక్ష, అణచివేత చర్యలను తమ ప్రభుత్వం ఉపేక్షించదని హెచ్చరించారు. అసెంబ్లీలో బీఆర్ఎస్ నేతల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనికి ఎర్రవల్లి ఫామ్ హౌజ్‌లోనే కుట్ర జరిగిందని ఆరోపించారు. ఫామ్‌హౌస్‌లో భేటీ మొదలుకుని వరుస ఘటనలపై విచారణ జరిపిస్తామని, అంటరానితనం ప్రదర్శించిన వారిపై విచారణకు ఆదేశిస్తున్నామని, కుట్రలు చేసిన వారిని, అమలు చేసిన వారిని కోర్టు ముందు దోషులుగా నిలబెడతామని స్పష్టం చేశారు. అంటరానితనం ఘటనపై విచారణ అధికారిగా విజయ్‌కుమార్‌ను నియమిస్తున్నామని వెల్లడించారు.

**అందరినీ శిక్షించేలా విచారణ :**

అసెంబ్లీ వద్ద అంగప్రదర్శన చేసి మహిళలను ఇబ్బందిపెట్టిన ఘటనపై కూడా విచారణ చేపడుతున్నామని, డ్యూటీలో ఉన్న వారిపై జరిగిన దాడుల వివరాలను కూడా సేకరిస్తామని స్పష్టం చేశారు. ఎక్కడో ఉండి సూచనలు చేసిన వారు, అమలు చేసిన వారిపైనా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కుట్రధారులు, పాత్రధారులు అందరినీ శిక్షించేలా విచారణ చేస్తామని, క్రిమినల్ కేసులు పెట్టి కఠినంగా శిక్షించేలా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

తల్లిని అవమానిస్తారా? : రాష్ట్రంలో నిన్న కేసీఆర్ ఫామ్‌హౌస్ రోడ్డును శుద్ధీకరణ చేశారని, ఫామ్‌హౌస్‌లో ఎమ్మెల్యేలతో మీటింగ్ పెట్టిన విపక్షనేత కేసీఆర్ చేసిన కుట్ర ఇదేనా? అని ప్రశ్నించారు. అసెంబ్లీ ముందు విధుల్లో ఉన్న మహిళా ఉద్యోగులను ఇబ్బంది పెట్టారని, దళితుడైన సభాపతిని ఘోరమైన పదంతో దూషించారని ఆరోపించారు. రాజకీయంగా ఎన్ని విభేదాలైనా ఉండొచ్చని, కానీ తల్లిని అవమానిస్తారా? నిలదీశారు. సభాపతికి క్షమాపణలు చెప్పి తప్పును సరిదిద్దుకోవాలని అన్ని పార్టీలు సూచించాయని గుర్తు చేశారు.

**ఈ ప్రభుత్వం ఉపేక్షించదు :**

శుద్ధి చేయాల్సింది నేలను కాదని, అంటరానితనం ఆలోచనలను శుద్ధి చేయాలని, తరతరాలుగా వాళ్ల మనసుల్లో ఉన్న కుళ్లు, అంతరాలను శుద్ధి చేయాలని హితవు పలికారు. దళితులు నడిచారని నేలను శుద్ధి చేయించిన దొర అహంకారాన్ని శుద్ధి చేయాలని, దళితులను అవమానించిన ప్రతి ఒక్కరిని చట్టపరంగా కూడా శిక్షిస్తామని హెచ్చరించారు. మల్లికార్జున ఖర్గే, ప్రసాద్‌కుమార్‌కు జరిగిన అవమానాలు వ్యక్తులకు జరిగినవి కాదని, కులవివక్ష, అణచివేత చర్యలను ప్రజా ప్రభుత్వం ఉపేక్షించదని స్పష్టం చేశారు.



# రైస్ మిల్లర్ల సమ్మె నోటీస్

- **డిమాండ్లు నెరవేర్చే వరకు మిల్లింగ్ చేసేది లేదు**
- **రైస్ మిల్లర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పెరుమాండ్ల తిరుపతి గౌడ్**

**భూపాలపల్లి, ఆయుధం:** సీఎంఆర్ రైస్ మిల్లర్లు తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బుధవారం జాయింట్ కలెక్టర్ అశోక్ కుమార్ కు వినతి పత్రం సమర్పించారు. ఈసందర్భంగా రైస్ మిల్లర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పెరుమాండ్ల తిరుపతిగౌడ్ మాట్లాడుతూ. మిల్లుల్లో షార్ట్ పాల్ కు కార్పోరేషన్ కాస్ట్ షీట్ ప్రకారం డబ్బులు చెల్లించాలని ఒత్తిడి చేయవద్దని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇచ్చిన గడువు లోగా సీఎంఆర్ ఇచ్చేందుకు మిల్లర్లకు అవకాశం కల్పించాలని కోరారు. యాసంగి ధాన్యాన్ని రా రైస్ ఇవ్వలేమని బాయిల్డ్ రైస్ గా ఇస్తామని చెబుతున్నా పట్టించుకోవడం లేదని అన్నారు. మిల్లర్ల వద్ద ఉన్న యాసంగి ధాన్యాన్ని టెండర్ల ద్వారా తరలించే చర్యలు చేపట్టాలని విన్నవించారు. రాష్ట్ర వ్యాప్తంగా మిల్లర్ అసోసియేషన్ నిర్ణయం మేరకు జిల్లా వ్యాప్తంగా మిల్లింగ్ నడపడం నిలిపి వేసినట్లు తెలిపారు. రైతులు నాన్ ఎఫ్ ఏ క్యు ధాన్యం మిల్లులకు పంపడం వలన సివిల్ సప్లై నిర్ణయించిన మేరకు రైసును ఇవ్వలేకపోతున్నామని దీనివల్ల మిల్లర్లు ఆర్థికంగా నష్టాల ఊబిలో కురుకోవాల్సిన దుర్భర పరిస్థితి నెలకొందన్నారు. ప్రభుత్వం మిల్లర్లపై విజిలెన్స్ దాడులు ఆపి నిర్వహణ వ్యయ భారాన్ని తగ్గించేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో మిల్లర్లు పిట్ట భిక్షపతి, దడిగెల దేవేందర్, మహమ్మద్ రహిమొద్దిన్, శ్రీధర్ పాల్గొన్నారు.

# 'సభా గౌరవాన్ని మంటగలపొద్దు'

(మొదటి పేజీ తరువాయి..)

క్షమాపణ చెప్పడం నాయకత్వ లక్షణమని, దాంతో గౌరవం తగ్గదని వ్యాఖ్యానించారు.
మహిళా పోలీసుల పట్ల అమర్యాదపై చర్యలు తీసుకోవాలి మహిళా పోలీసు సిబ్బందితో వ్యవహరించే తీరుపైనా ఎంపీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. మహిళా కానిస్టేబుల్ అయినా, ఉన్నతాధికారి అయినా ప్రతి మహిళను గౌరవించడం భారతీయ సంస్కృతిలో భాగమన్నారు. మహిళా పోలీసుల సమక్షంలో కేటీఆర్, హరీష్ రావు చొక్కాలు విప్పడం, ఆందోళన సమయంలో వ్యవహరించిన తీరు తీవ్రంగా అభ్యంతరకరమని పేర్కొన్నారు.

**మహిళల భద్రతపై స్పష్టమైన సందేశం అవసరం?**

మహిళా సాధికారత గురించి మాట్లాడుతున్న సమయంలో, చట్టాన్ని అమలు చేసే మహిళా పోలీసులే రాజకీయ ఆందోళనల్లో ఇబ్బందికర పరిస్థితులను ఎదుర్కొంటే భవిష్యత్తులో వారు విధులు నిర్వహించేందుకు భయపడే పరిస్థితి ఏర్పడుతుందని ఎంపీ ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజాప్రతినిధులు, ముఖ్యంగా సుదీర్ఘ అనుభవం ఉన్న మాజీ మంత్రులు వ్యవహరించే తీరు వారి కార్యకర్తలు, అనుచరులకు కూడా ఆదర్శంగా మారుతుందని అన్నారు.
ఈ ఘటనపై తాను జాతీయ మహిళా కమిషన్‌కు ఫిర్యాదు చేసినట్లు డా. కడియం కావ్య తెలిపారు. ఘటనపై సమగ్ర దర్యాప్తు చేపట్టి, బాధ్యులైన కేటీఆర్, హరీష్ రావులను కమిషన్ ముందు వివరణ కోరాలని విజ్ఞప్తి చేసినట్లు చెప్పారు. తెలంగాణ డీజీపీ, పోలీస్ కమిషనర్, తెలంగాణ శాసనసభ సెక్రటేరియట్, సంబంధిత అధికార యంత్రాంగం కూడా ఘటనను పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని కోరినట్లు వెల్లడించారు. "ప్రతిపక్షాలు ప్రభుత్వాన్ని నిలదీయాలి.. విధానాలను ప్రశ్నించాలి.. ప్రజా సమస్యలపై పోరాడాలి. కానీ ఆందోళనలు కూడా హుందాగా, ప్రజాస్వామ్య పద్ధతుల్లోనే ఉండాలి. మహిళలను గౌరవించడం, చట్టసభల గౌరవాన్ని కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత" అని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య స్పష్టం చేశారు.

# కాళోజీ సాహిత్యం, సేవలు చిరస్మరణీయం

- **తెలంగాణ కోసం నిరంతరం పరితపించిన ప్రజాకవి కాళోజీ**
- **అదనపు కమిషనర్ ఈసంపల్లి జోనా**



**వరంగల్, ఆయుధం:** ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతిని పురస్కరించుకుని తెలంగాణ భాషా దినోత్సవం సందర్భంగా బుధవారం గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో కాళోజీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అదనపు కమిషనర్ ఈసంపల్లి జోనా కాళోజీ నారాయణరావు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో అదనపు కమిషనర్ మాట్లాడుతూ, కాళోజీ నారాయణరావు తెలంగాణ సమాజానికి, సాహిత్య రంగానికి అందించిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. తెలంగాణ ... సజీవంగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సీఎంహెచ్ఓ డా. రాజారెడ్డి, డీఎఫ్ఓ శంకర్‌లింగం, అకౌంట్స్ అధికారి శివలింగం, సీహెచ్ఓ లక్ష్మారెడ్డి, ఎస్ఈ రాజ్‌కుమార్, డిప్యూటీ కమిషనర్లు ప్రసన్నరాణి, సమ్మయ్య, ఎంహెచ్ఓ డా. రాజేష్, హెచ్ ఓ ప్రశాంత్, ఈఈ లు సంతోష్‌బాబు, రవి కుమార్, సంజయ్ కుమార్, అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# గవర్నర్‌కు ఆధారాలు చూపాం

- **బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నేతలు**
- **మహిళా ఎమ్మెల్యేలపై పోలీసుల అనుచిత ప్రవర్తనపై ఫిర్యాదు చేసిన నేతలు**
- **శాంతిభద్రతలు, ఇతర అంశాలపై గవర్నర్‌కు ఫిర్యాదు**



**హైదరాబాద్, ఆయుధం:** లోక్‌భవన్‌లో గవర్నర్ శివ్‌ప్రతాప్ శుక్లాను బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నేతలు కలిశారు. మహిళా ఎమ్మెల్యేలపై పోలీసుల అనుచిత ప్రవర్తనపై, శాంతిభద్రతలు, ఇతర అంశాలపై ఫిర్యాదు చేశారు. అనంతరం ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మీడియా సమావేశంలో మాట్లాడారు.

**కేసు నమోదు కాలేదు:** శాసనసభ్యులపై నడిరోడ్డుపై పోలీసులు ఎలా దాడి చేశారో గవర్నర్‌కు ఆధారాలు చూపామని, ఎమ్మెల్యే సబితపై పోలీసుల దాడి, సునీత చీర లాగి దుశ్శాసన పర్వానికి తెరలేపడంపై ఆధారాలు సమర్పించామని తెలిపారు. తమపై దాడులు చేసి తమపైనే కేసులు పెట్టారని శివ్‌ప్రతాప్ శుక్లాకు వివరించామని పేర్కొన్నారు. దాడులపై కమిషనర్ కార్యాలయంలో ఫిర్యాదు చేస్తే కేసు నమోదు కాలేదని వెల్లడించారు.

**నిరుద్యోగులను ఏవిధంగా మోసం చేశారో వివరించాం :**

తెలంగాణ రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితుల గురించి కూడా గవర్నర్‌కు వివరంగా తెలిపామని కేటీఆర్ తెలిపారు. వంద రోజుల్లోనే అన్ని హామీలు అమలు చేస్తామని అరచేతిలో స్వర్గం చూపారని, కానీ ప్రభుత్వంలోకి వచ్చి వెయ్యి రోజులైనా హామీలు అమలు చేయలేదని కేటీఆర్ ఆరోపించారు. రైతుబంధు కింద గతంలో రూ.73 వేల కోట్లు ఇస్తే.. ఇప్పుడు యూరియా ఇవ్వట్లేదని తెలిపామని, రైతు బీమా ఎగ్గొట్టి రైతులకు ధీమా లేకుండా చేశారని, రాష్ట్రంలో నిరుద్యోగులను ఏవిధంగా మోసం చేశారో వివరించామని పేర్కొన్నారు. పార్లమెంటుకు రాహుల్‌గాంధీ వెళ్లినట్లే మేమూ నల్ల టీషర్టులు వేసుకుని వచ్చామని, వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలనపై నిరసన తెలిపేందుకు అసెంబ్లీకి వెళ్లామని కేటీఆర్ స్పష్టం చేశారు.

"శాసనసభ్యులపై నడిరోడ్డుపై పోలీసులు ఎలా దాడి చేశారో గవర్నర్‌కు ఆధారాలు చూపాం. సబితపై పోలీసుల దాడి, అవమానంపై గవర్నర్‌కు ఆధారాలు సమర్పించాం. సునీత చీర లాగి దుశ్శాసన పర్వానికి తెరలేపడంపై ఆధారాలు సమర్పించాం. మాపై దాడులు చేసి మాపైనే కేసులు పెట్టారని గవర్నర్‌కు వివరించాం. దాడులపై కమిషనర్ కార్యాలయంలో ఫిర్యాదు చేస్తే కేసు నమోదు కాలేదు.పార్లమెంటుకు రాహుల్‌గాంధీ వెళ్లినట్లే మేమూ నల్ల టీషర్టులు వేసుకుని వచ్చాం. వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలనపై నిరసన తెలిపేందుకు అసెంబ్లీకి వెళ్లాం" అని కేటీఆర్ పేర్కొన్నారు.

# పరీక్ష నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు

- **కలెక్టర్ చాహత్ బాజ్ పాయి**
- **ప్రభుత్వ పింగిళి డిగ్రీ కళాశాలలో కంబైన్డ్ సర్వీసెస్ ఎగ్జామినేషన్ కేంద్రంను పరిశీలించిన కలెక్టర్**



**హనుమకొండ, ఆయుధం:** ఈ నెల 13వ తేదీన(ఆదివారం) జరగనున్న నేషనల్ డిఫెన్స్ అకాడమీ అండ్ నావల్ అకాడమీ ఎగ్జామినేషన్ 2, కంబైన్డ్ డిఫెన్స్ సర్వీస్ 2 పరీక్ష నిర్వహణకు పరీక్షా కేంద్రాలలో పకడ్బందీ ఏర్పాట్లు ఉండాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి ఆదేశించారు. బుధవారం హనుమకొండ వడ్డేపల్లి లోని పింగిళి ప్రభుత్వ బాలికల డిగ్రీ, పీజీ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ పరిశీలించారు. కళాశాలకు చేరుకున్న కలెక్టర్‌కు కళాశాల సిబ్బంది ఘన స్వాగతం పలకగా, ఎన్‌సీసీ కేడేట్లు గౌరవ వందనం సమర్పించారు. ఈ సందర్భంగా పరీక్షా కేంద్రంలో ఎంతమంది అభ్యర్థులకు పరీక్షకు కేటాయించారనే వివరాలను కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ బి. చంద్రమౌళి ని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. పరీక్ష కోసం కేటాయించిన తరగతి గదులను పరిశీలించారు. కళాశాలలోని కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ గదిని సందర్శించి పరీక్షకు సంబంధించి వచ్చిన మెటీరియల్ వివరాలను ఎగ్జామినేషన్ ఇన్చార్జి సుహాసిని కలెక్టర్ కు వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ... పరీక్ష నిర్వహణలో నిబంధనలను కచ్చితంగా పాటించాలని ఆదేశించారు. పరీక్షా గదుల నిర్వహణ, తాగునీరు, విద్యుత్, భద్రత తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సూచించారు. అదేవిధంగా కలెక్టరేట్ లోని పరీక్షలకు సంబంధించిన మెటీరియల్ ను భద్రపరిచిన స్ట్రాంగ్ రూమును కలెక్టర్ పరిశీలించారు. వాటికి సంబంధించిన వివరాలను జిల్లా ఖజానా అధికారి శ్రీనివాస్ కుమార్, కలెక్టరేట్ పరిపాలన అధికారి గౌరీ శంకర్ కలెక్టర్ కు వివరించారు. హనుమకొండ సుబేదారిలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఎన్డీఏ, నావల్ అకాడమీ పరీక్ష ఈనెల 13న ఉదయం 10:00 నుండి మధ్యాహ్నం 12:30 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుండి సాయంత్రం 4:30 గంటల వరకు పరీక్ష జరుగుతుందని, అదేవిధంగా వడ్డేపల్లి లోని పింగళి ప్రభుత్వ బాలికల డిగ్రీ, పీజీ కళాశాలలో సిడిఎస్ పరీక్ష ఉదయం 9 నుండి 11 గంటల వరకు, మధ్యాహ్నం 12:30 నుండి 2:30 గంటల వరకు, సాయంత్రం 4 నుండి 6 గంటల వరకు పరీక్ష జరుగుతుందని అధికారులు తెలిపారు.

**తరగతి గదులను పరిశీలించిన కలెక్టర్**

పింగిళి ప్రభుత్వ డిగ్రీ పీజీ కళాశాలను సందర్శించిన కలెక్టర్ కళాశాలలోని తరగతులైన పరిశీలించారు. బీసీఏ ప్రథమ సంవత్సరం చదువుతున్న విద్యార్థినులతో కలెక్టర్ మాట్లాడారు. చదువులు పూర్తయిన వెంటనే పోటీ పరీక్షలకు సన్నద్ధం కావాలని, సాఫ్ట్వేర్ రంగంలోనూ ఉద్యోగాలు సాధించాలని విద్యార్థినులకు సూచించారు. కళాశాలలో విద్యార్థినుల సంఖ్య, బోధన, బోధనేతర సిబ్బంది వివరాలను, మౌలిక వసతులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.



# విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

**వేలేరు, ఆయుధం:** వేలేరు మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని సర్పంచ్ బిల్లా యాదగిరి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు అందిస్తున్నటువంటి భోజనంలో నాణ్యతను పాటించాలని ప్రధానోపాధ్యాయులు, కమిటీ వారికి సూచించారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలలో కలిపి మొత్తం విద్యార్థులు 328 మంది విద్యార్థులు చదువుకోవడం జరుగుతుందని, వారికి నాణ్యమైన విద్యను, భోజనాన్ని అందించాలని కోరారు. ప్రభుత్వం ఇస్తున్నటువంటి వసతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని బాగా చదువుకోవాలని కోరారు. అదేవిధంగా మధ్యాహ్న భోజనం ఎలా ఉందని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరము విద్యార్థులతో కలసి సర్పంచ్ భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ శ్రీకర్, ప్రధానోపాధ్యాయులు సత్యం, కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు

# శ్రీవారి భక్తులకు ఎల్ఐసీ బీమా

- **టీటీడీ పాలక మండలి కీలక నిర్ణయాలు**



**తిరుమల, ఆయుధం:** భక్తులు, ఉద్యోగుల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ టీటీడీ పాలక మండలి కీలక నిర్ణయాలు తీసుకుంది. వివరాలను ఈవో ముద్దాడ రవిచంద్రతో కలిసి తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు వెల్లడించారు. దేశంలోనే తొలిసారిగా ఎల్ఐసీ ద్వారా భక్తులకు బీమా సదుపాయం కల్పిస్తున్నట్లు తెలిపారు. శ్రీవారి బ్రహ్మోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు తితిదే అన్ని ఏర్పాట్లను పూర్తి చేస్తోందన్నారు. సాలకట్ల బ్రహ్మోత్సవాలు సెప్టెంబర్ 15 నుంచి 23వ తేదీ వరకు.. అక్టోబర్ 12 నుంచి 20వ తేదీ వరకు నవరాత్రి బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు వివరించారు. సెప్టెంబర్ 15న రాష్ట్ర ప్రభుత్వం తరఫున స్వామివారికి సీఎం చంద్రబాబు పట్టు వస్త్రాలు సమర్పిస్తారని చెప్పారు.
"శ్రీవారి దర్శనానికి వచ్చే భక్తులకు బీమా సౌకర్యం కల్పించాలని నిర్ణయించాం. దేశంలో ఎక్కడా లేని విధంగా తిరుమలలో సహజ మరణానికి రూ.2లక్షల బీమా వర్తిస్తుంది. ఈ పథకం కోసం ఎల్ఐసీ సంస్థకు తితిదే నిధుల నుంచి రూ.2.12 కోట్లు చెల్లించేందుకు ఆమోదం తెలిపాం. ప్రమాదవశాత్తు మరణించిన ఉద్యోగుల కుటుంబీకులకు బీమాను రూ.3లక్షల నుంచి రూ.10లక్షలకు పెంచుతూ నిర్ణయం తీసుకున్నాం. CPS/NPS పెన్షనర్లు, వారి కుటుంబాలకు EHF సౌకర్యం కల్పిస్తూ రూ.2 కోట్ల యాజమాన్య వాటాకు పాలకమండలి అంగీకారం తెలిపింది.
శ్రీవారి పోటులో లడ్డూల తయారీని మరింత వేగవంతం చేసేందుకు 400 మంది అదనపు అవుట్ సోర్సింగ్ వర్కర్ పోస్టుల కోసం ప్రభుత్వ అనుమతికి ప్రతిపాదనలు పంపుతున్నాం. తితిదేలోని వివిధ విభాగాల్లో పని చేస్తున్న 48 మంది ఉద్యోగుల వేతనాలను పెంచాలని నిర్ణయించాం. నారాయణవనం శ్రీపద్మావతి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారి పద్మపీఠానికి బంగారు తాపడం ఏర్పాటుకు ఆమోదం తెలిపాం. చెన్నైలోని శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయ ధ్వజస్తంభం, బలిపీఠానికి బంగారు తాపడం కోసం రూ.17.05 కోట్లకు పాలకమండలి ఆమోదం తెలిపింది'' అని బీఆర్ నాయుడు వెల్లడించారు.

# చలో హైదరాబాద్ వాయిదా వేశాం

(మొదటి పేజీ తరువాయి..)

ప్రకటిస్తామని వెల్లడించారు.
జేఏసీ నేత ఏలూరి శ్రీనివాస్ మాట్లాడుతూ.. 13 లక్షల మంది ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం కార్యాచరణ ప్రకటించామని పేర్కొన్నారు. ఇప్పటికే దశలవారీగా ఉద్యమం చేస్తున్నామని తెలిపారు. తాము ఎక్కడ రాజీ పడకుండా.. పోరాడుతున్నామని స్పష్టం చేశారు. సీఎస్ జేఏసీ నేతలతో చర్చించారని.... పీఆర్ఎసీ రిపోర్ట్ పై ఆదేశించారు. సీపీఎస్ పై కమిటీ వేస్తున్నట్లు చెప్పారని వెల్లడించారు. ఉద్యోగులకు సంబంధించి రూ.11 వేల కోట్లు పెండింగ్ బిల్లులు ఉన్నాయని చెప్పారు. అసెంబ్లీ అయిపోయాక ముఖ్యమంత్రి మాట్లాడతామని చెప్పినట్లు తెలిపారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి స్పష్టమైన హామీ ఇచ్చారు.. 18 వరకు మాత్రమే ఆగుతాం.. ఆర్థిక పరిస్థితి బాగా లేకున్న .. మీ సమస్య తీరుస్తామని చెప్పారు.. అప్పటి వరకు చలో హైదరాబాద్ తాత్కాలికంగా వాయిదా వేస్తున్నామని అన్నారు. ముజీబ్ హుస్సేని.. మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం 18 వరకు ఆగమని చెప్పింది. 18 తర్వాత మా కార్యాచరణ కంటిన్యూ ఉంటుంది. అని వెల్లడించారు.



# కాళోజీ నారాయణరావు జయంతి

**వరంగల్, ఆయుధం:** జిల్లా గ్రంథాలయ సంస్థ వరంగల్‌లో ప్రజాకవి కాళోజీ నారాయణరావు 112వ జయంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ మీసాల ప్రకాష్ కాళోజీ చిత్ర పటానికి పూలమాలవేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మీసాల ప్రకాష్ మాట్లాడుతూ కాళోజీ అనేక భారతీయ భాషల్లో రచయితగా ప్రఖ్యాతి గాంచారని, రాజకీయ వ్యంగ్య కవిత్వం వ్రాయడంలో కాళోజీ దిట్ట అని కొనియాడారు. 'నా గొడవ' పేరిట సమకాలీన సామాజిక సమస్యలపై స్పందిస్తూ పాలకులపై ఆయుధాలను సంధించి ప్రజాకవిగా కీర్తి పొందాడని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పి.బుగ్గారెడ్డి, ఎం.చిన్నబాబు పాల్గొన్నారు. వరంగల్ జిల్లా కాంగ్రెసు నాయకులు జంగం ప్రభాకర్, సిబ్బంది రజిత, పాఠకులు పాల్గొన్నారు.

# ముగిసిన జిల్లాస్థాయి యోగా పోటీలు

- **యోగ జీవితంలో నిరంతర ప్రక్రియ**
- **డాక్టర్ చంద్రశేఖర ఆర్య**

**వరంగల్, ఆయుధం:** వరంగల్ జిల్లా యోగా అసోసియేషన్ ఆధ్వర్యంలో వివిధ విభాగాలలో యోగాసనా పోటీలు బుధవారం ఉదయం 8:00 గంటలకు ఓ సిటీ స్టేడియం లో నిర్వహించారు. జిల్లాస్థాయి యోగ పోటీలు ప్రారంభానికి ముఖ్యఅతిథిగా వరంగల్ జిల్లా యోగ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు డాక్టర్ కే.చంద్రశేఖర్ ఆర్య, విచ్చేసి ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ యోగ అనేది జీవితంలో నిరంతర ప్రక్రియగా కొనసాగించాలని క్రీడాకారులు ఉద్దేశించి వారు యోగ వలన మంచి ఆరోగ్యం అభివృద్ధి దశలో ముందుంటారని వారు తెలిపారు. ఈ పోటీలలో యోగ క్రీడాకారులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం పోటీలు నిర్వహించారు. ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తెలంగాణ రాష్ట్ర యోగ అసోసియేషన్ ఉపాధ్యక్షులు వరంగల్ జిల్లా అధ్యక్షులు బొలిశెట్టి కమలాకర్ హాజరై గెలుపొందిన యోగా క్రీడాకారులకు సర్టిఫికెట్స్, మెడల్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా యోగ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పాకాల కృష్ణవేణి, రవీందర్, ఉపాధ్యక్షులు మండల నరసింహ రాములు, కోశాధికారి సాంబశివరావు, కోట రజిత, జ్యోతి, తీగల శ్రీనివాస్, ఎండి.పాషా, అభినవ్ నేతాజీ, మౌనిక, హనుమకొండ జిల్లా యోగా అసోసియేషన్ కార్యదర్శి కమల, కిషన్, ఉపాధ్యక్షులు కుండే కిరణ్, యోగా క్రీడాకారులు హాజరయ్యారు.






Edited, Printed, Published and Owned by **V.P.CHANDER.** On Behalf of **VNR MEDIA**. Printed at Pragathi Graphics # 6-8-231, Sagara Veedhi, Hanumakonda.
Published at 2-2-414, Nayeem Nagar, Hanumakonda, TS-506001. RNI: TEL TEL 2019/78717, Email: ayudamdaily@gmail.com. Contact: 98480-15695